

బంజారాహిల్స్‌లోని కేబీఆర్ నేషనల్ పార్కులో ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎంసీ పర్గెన్ హాజరయ్యారు. పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల నిర్వహించిన చిత్రలేఖనం, డ్రాయింగ్, కేబీఆర్ త్రూ లెన్సెస్ పేరుతో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. -బంజారాహిల్స్, మార్చి 20


రాంనగర్ నుంచి పార్సిగుట్టకు వెళ్లే ప్రధాన రహదారిలో డ్రైనేజీ పనులు నత్తనడకన సాగుతుండటంతో వ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.


మాట్లాడుతున్న అమానుల్లాఖాన్

## మహాలక్ష్మి పథకాన్ని రద్దు చేయాల్సిందే

### ఆటో డ్రైవర్స్ జేఏసీ

హిమాయత్‌నగర్: ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారని తెలంగాణ ఆటో డ్రైవర్స్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకాన్ని తక్షణమే రద్దు చేయాలని, లేని పక్షంలో లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయకుండా ఆటో డ్రైవర్లు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ ఎస్ ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ ఫైనాన్సియర్ల వద్ద రుణాలు తీసుకొని ఆటోలను కొనుగోలు చేసుకున్న ఆటో డ్రైవర్లు స్వయం ఉపాధి పొందుతూ జీవనం సాగిస్తున్నారన్నారు. మూడు నెలలుగా గిరాకీ లేకపోవడంతో రాష్ట్రంలో ఉన్న 7లక్షల మంది ఆటో డ్రైవర్ల కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయన్నారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలకు కారణమైన ఉచిత బస్సు ప్రయాణాన్ని ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి రూ.12వేలు, ఈఎస్ఐతో పాటు ఆటో, మోటారు రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు.



## ఓల్డ్ సిటీ మెట్రో పనులకు పీటముడి

### పాత ఒప్పందం పీపీపీ ప్రాతిపదికన చేపట్టేందుకు ఎల్ అండ్ టీ వెనుకంజ

### కేవలం పనుల నిర్వహణకు సిద్ధమంటున్న సంస్థ

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 20 (నమస్తే తెలంగాణ): ప్రపంచంలోనే అతి పెద్ద పబ్లిక్-ప్రైవేటు-పార్ట్‌నర్‌షిప్ మెట్రో రైలు ప్రాజెక్టు అయిన హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశకు ఇప్పుడు అదే పీపీపీ పీటముడిగా మారింది. ఉమ్మడి రాష్ట్రంలో ఈ విధానాన్ని హాట్‌కేక్‌లా భావించిన ఎల్‌అండ్‌టీ సంస్థ ఇప్పుడు ఆ పదం అనగానే ఆందోళనకు గురవుతున్నది.ఈ నేపథ్యంలో గత ఒప్పందంలో భాగంగా పాతబస్తీ మెట్రో పనులను కూడా ఇదే విధానంలో చేపట్టాల్సి ఉండగా... ఎల్‌అండ్‌టీ సంస్థ మాత్రం ససేమిరా అంటున్నది. సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన ఎంజీబీఎస్-ఫలక్‌నుమా అలైన్‌మెంట్ మెట్రో పనులకు సాధారణ విధానంలో టెండర్లు పిలిస్తే పనుల నిర్వహణకు ముందుకొస్తామేగానీ... పాత ఒప్పందంలోని పీపీపీ అంటే మాత్రం చేతులెత్తేయడం మినహా గత్యంతరంలేదని తేల్చి చెబుతున్నది.

#### 5.5 కిలోమీటర్ల మార్గం..

ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టును పీపీపీ విధానంలో మూడు అలైన్‌మెంట్లలో సుమారు 72 కిలోమీటర్ల మేర రూపకల్పన చేశారు. ఇందులో జేబీఎస్-ఫలక్‌నుమా మార్గంలో ఎంజీబీఎస్ వరకు మాత్రమే పనులు పూర్తి చేశారు. దీంతో 5.5 కిలోమీటర్ల ఎంజీబీఎస్-ఫలక్‌నుమా మార్గం పెండింగ్‌లో ఉండి పోయింది. మిగిలిన రెండు మార్గాలతో పాటు మూడో మార్గంలో జేబీఎస్-ఎంజీబీఎస్ మెట్రో అందుబాటులోకి వచ్చి కొనసాగుతున్నది. ఒప్పందం ప్రకారం ఎల్ అండ్‌టీ సంస్థ 35 ఏండ్ల పాటు నిర్వహణను కూడా చేపట్టాల్సి ఉంది. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు హెచ్ఎంఆర్ఎల్ అధికారులు పాతబస్తీతో పాటు ఎయిర్‌పోర్టు మెట్రోతో 70 కిలోమీటర్ల మేర ఏడు మార్గాలకు ప్రతిపాదనలు తయారు చేశారు. పాత ఒప్పందంలోని ఎంజీబీఎస్-ఫలక్‌నుమా 5.5 కిలోమీటర్ల మార్గాన్ని చేర్చారు. ఈ పనులకు కొన్నిరోజుల కిందట సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అయితే ఈ అలైన్‌మెంట్ గత పీపీపీ ఒప్పందంలో ఉన్నందున పెరిగిన ధరల మేరకు అంచనాలు పెంచి ఎల్‌అండ్‌టీకే పనులు అప్పగించాల్సి ఉంటుంది. కానీ ఎల్‌అండ్‌టీ మాత్రం అందుకు ముందుకు రావడం లేదు. పీపీపీ విధానంలో ప్రయాణికుల టికెట్ల ద్వారా 40 శాతం, వ్యాపార ప్రకటనలపై మరో ఐదు శాతం ఆదాయం వస్తే మిగిలిన 55 శాతం రియల్ ఎస్టేట్ రంగం ద్వారా వస్తుందని పొందుపరిచారు. కానీ ఎల్‌అండ్‌టీ సంస్థకు ప్రాజెక్టులోని రియల్ ఎస్టేట్ రంగం ఆశాజనకంగా లేదు. దీంతో పీపీపీ విధానానికి ఆ సంస్థ సుముఖంగా లేదు. సాంకేతికంగా తప్పించుకునేందుకు ప్రభుత్వపరంగానే ఆ మార్గం పనులు మొదలుకానందున తాము చేపట్టలేమని తేల్చి చెబుతున్నది.

#### అడుగు ముందుకు పడేదెలా?

ఎంజీబీఎస్-ఫలక్‌నుమా అలైన్‌మెంట్ పనులు మొదలు కావాలంటే తొలుత నిర్మాణ సంస్థ ఖరారు కావాలి. పాత ఒప్పందం ప్రకారం పీపీపీ విధానానికి ఎల్ అండ్‌టీ సంస్థ అంగీకరించడం లేదు. దీంతో సంస్థను ఒప్పించి ఆ ఒప్పందం ప్రకారం ముందుకుపోవడమా? లేదా సాధారణ టెండర్ల ద్వారా ప్రాజెక్టు పనులకు టెండర్ పిలవడమా? అనేది తేలాల్సి ఉంది. పెరిగిన రేట్ల ప్రకారం అంచనా వ్యయాన్ని పెంచి పనులు అప్పగించేందుకు గతంలోని కేసీఆర్ ప్రభుత్వంతో పాటు ఈ ప్రభుత్వం కూడా అంగీకరించే అవకాశమున్నది. కానీ పీపీపీ విధానమంటేనే ఎల్‌అండ్‌టీ ఒప్పుకునే పరిస్థితి లేదు. ఈ క్రమంలో సాధారణ టెండర్లు పిలిచినా... ప్రాజెక్టు నిర్వహణ ఎలా? అనే మరో పీటముడి ఉంది. ఇందుకోసం హెచ్ఎంఆర్ఎల్ అధికారులు మళ్లీ కొత్త విధి విధానాలతో టెండరును రూపొందించాలి. ఈ గండం గట్టెక్కినా... ఇప్పటికే ఎల్‌అండ్‌టీ నిర్వహిస్తున్న అలైన్‌మెంట్‌కు ఎంజీబీఎస్-ఫలక్‌నుమా మార్గాన్ని అనుసంధానించాలి. ఇందుకు ఎల్‌అండ్‌టీ అంగీకరించాలంటే ఆ సంస్థ నుంచి ఎలాంటి షరతులు ఉంటాయోనన్న సందేహాలూ వ్యక్తమవుతున్నాయి. ఇలా పాతబస్తీ మెట్రో పనుల ప్రారంభానికి పీపీపీ-టెండర్లు-నిర్వహణ విధి విధానాలు వంటి పలు సవాళ్లు పీటముడిగా మారాయి.


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, అరెకపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, కాలే యాదయ్య, ఎమ్మెల్సీలు వాణీదేవి, దయానంద్‌గుప్తా , ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు

## పంటలు ఎండిపోతున్నా.. సర్కారు పట్టించుకోవట్లే

### మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

శంషాబాద్ రూరల్, మార్చి 20 : అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతుల పంటలు ఎండిపోతున్నా... పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విమర్శించారు. కనీసం ప్రజలకు తాగునీరు ఇవ్వలేని దుస్థితిలో సర్కారు ఉందన్నారు. బుధవారం శంషాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, కాలే యాదయ్య, అరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీలు వాణీదేవి, దయానంద్‌గుప్తాతో పాటు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాన్ని అందించిన కేసీఆర్‌కు రాష్ట్ర ప్రజలు అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపునకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గణేశ్ గుప్తా, కార్తిక్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీగా రేవంత్.. మల్కాజిగిరికి చేసిందేమీలేదు

### బీఆర్ఎస్ ఎంపీ రాగిడి లక్ష్మారెడ్డి


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 20 : మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి ఇక్కడి ప్రజలకు చేసిందేమీలేదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. రాజకీయంగా భిక్ష పెట్టిన మల్కాజిగిరి పార్లమెంట్‌ను మరిచి కొడంగల్‌లో అభివృద్ధి పనులకు రూ.3,500 కోట్లు కేటాయించారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బుధవారం కూకట్‌పల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పదేండ్లుగా తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా అభివృద్ధి చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ ముందు చూపుతో హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ నగరంగా తీర్చిదిద్దారన్నారు. స్థానికేతరుడైన బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు బుద్ధి చెప్పాలన్నారు. ఐదేండ్లుగా ఎంపీగా ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి అభివృద్ధిని ఎంత మాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూకట్‌పల్లిలో వచ్చేనెల 2 నుంచి 15వ తేదీ వరకు డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహిస్తానని తెలిపారు.



## 'కాంగ్రెస్‌కు ఉసురు తగులుతుంది'

సిటీబ్యూరో/చిక్కడపల్లి, మార్చి 20 ( నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత బస్సు పథకం వల్ల ఉపాధి లేక రాష్ట్రంలో 40 మంది ఆటో డ్రైవర్లు చనిపోయారని బీఆర్‌టీయూ అధ్యక్షుడు రాంబాబు యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్ల కుటుంబాల ఉసురు కాంగ్రెస్ పార్టీకి తప్పకుండా తగులుతుందని ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య పేర్కొన్నారు. చిక్కడపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మారయ్య మాట్లాడుతూ.. ఇటీవల మలక్‌పేటలో రమేశ్ అనే ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతామన్నారు.




## పేదోడి ఫంక్షన్ హాళ్లపై సర్కారు శీతకన్ను!

### మూడు నెలలు దాటినా.. 14 చోట్ల పురోగతి లేని పనులు

### బల్దియా నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

సిటీబ్యూరో, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : నిరుపేదలు సైతం గర్వించే స్థాయిలో వేడుకలు నిర్వహించుకునేలా ఆధునిక హంగులతో నిర్మించనున్న మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్లపై కాంగ్రెస్ సర్కారు శీతకన్ను వేసింది. ఒకేసారి రెండు వేల మందితో వేడుక నిర్వహించేలా.. సకల సౌకర్యాలతో గత కేసీఆర్ ప్రభుత్వం జీహెచ్ఎంసీ వ్యాప్తంగా రూ. 90 కోట్లతో 31 చోట్ల మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్లను నిర్మించాలని భావించింది. గతేడాది డిసెంబర్ నాటికి రూ. 30.10కోట్లతో 12 చోట్ల మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. నిర్మాణ దశలో 14 చోట్ల పనులు ఉండగా..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు దాటినా.. ఆ పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు జీహెచ్ఎంసీ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించకపోవడం..కమిషనర్ రోనాల్డ్ రాస్ సైతం అదే రీతిలో పురోగతిలో ఉన్న పనులను పట్టించుకోలేదు. ఫలితంగా ఇంజినీర్లు సైతం పనులను ముందుకు తీసుకువెళ్లలేక చాలా చోట్ల చేతులెత్తేశారు. కాంట్రాక్టర్లకు నిధుల లేమి సమస్య ఒకవైపు..మరోవైపు ఇంజినీర్ల అలసత్వం మరోవైపు వెరసి.. మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్ల నిర్మాణ పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వం చొరవ తీసుకొని బహుళ వినియోగ ఫంక్షన్‌హాళ్లను సకాలంలో అందుబాటులోకి తీసుకువచ్చి వందలాది మందికి ప్రయోజనం చేకూర్చాలని స్థానికులు కోరుతున్నారు.

## ఏమిటీ మతలబు?

### కాంగ్రెస్ నేత ఏజెన్సీకి బీజేపీ సర్కారు అండ

### పనులు చేయకున్నా.. గడువు పొడిగిస్తున్న కేంద్ర రహదారుల శాఖ

### ఆరేండ్లయినా సగం కూడా పూర్తికాని ఉప్పల్ కారిడార్ పనులు

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): ఆ కాంట్రాక్టు సంస్థ ఓ బడా కాంగ్రెస్ నేతది. రెండేండ్లలో పూర్తి చేయాల్సిన ఫ్లైఓవర్ నిర్మాణాన్ని ఆరేండ్లుగా సాగదీస్తున్నది. నిబంధనల ప్రకారం ఏజెన్సీని రద్దు చేసి మరొకరితో పనులు చేయించాల్సిన కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ... అలా చేయకుండా పదే పదే గడువు పొడిగిస్తూ సదరు సంస్థ పట్ల తమ విధేయత చాటుకుంటున్నది. ఇదీ ఉప్పల్-నారపల్లి ఫ్లైఓవర్ పరిస్థితి. నిత్యం ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకునే కాంగ్రెస్, బీజేపీ నాయకులు.. ఈ ఫ్లైఓవర్ విషయంలో మాత్రం ఒకరికొకరు సహకరించుకోవడం వెనుక ఉన్న మతలబు ఏమిటో అంతుబట్టడంలేదు.

#### 18 నెలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉన్నా..

వరంగల్ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులను నివారించే ఉద్దేశంతో రోడ్డు, రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ(ఎంఓఆర్‌టీఏహెచ్) ఆధ్వర్యంలో ఉప్పల్ జంక్షన్ నుంచి మేడిపల్లి సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. ఈ పనులకు మే 2018లో శంకుస్థాపన చేయగా, 18 నెలల్లో పనులు పూర్తిచేయాలని నిర్ణయించారు. ఓ ప్రముఖ కాంగ్రెస్ నాయకుడికి చెందిన ఏజెన్సీ(గాయత్రీ కన్‌స్ట్రక్షన్స్) పనులు చేపట్టింది. పనులను మే 2021లోగా పూర్తిచేయాలని నిర్ణయించారు. మొత్తం రూ. 675 కోట్లతో 45మీటర్ల వెడల్పు 6.2 కిలోమీటర్ల పొడవునా ఈ కారిడార్‌ను నిర్మిస్తున్నారు.

#### సగం కూడా పూర్తికాలే...

ఫ్లైఓవర్‌కు సుమారు రూ. 500కోట్లపైచిలుకు వ్యయం అవుతుండగా, కాంట్రాక్టు సంస్థ మాత్రం 25 శాతం లెస్‌కు, అంటే రూ. 400 కోట్లకు పనులు చేపట్టింది. సదరు ఏజెన్సీ ఎలాగైనా పనులు దక్కించుకోవాలనే ఆశతో గిట్టుబాటుకాని ధరను కోట్ చేసిందని, పనులు చేయలేక చతికిలపడిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటివరకు కేవలం రూ. 170 కోట్ల పనులు మాత్రమే పూర్తయ్యాయి. కాంట్రాక్టు రద్దు చేసి ఇతర ఏజెన్సీకి పనులు అప్పగించాలని ఆర్ అండ్ బీ శాఖ ఎంఓఆర్‌టీఏహెచ్‌కి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండాపోయింది.

#### రద్దీ వేళల్లో ట్రాఫిక్ జామ్‌లు

గాయత్రీ కన్‌స్ట్రక్షన్స్‌కు కేటాయించిన కాంట్రాక్టును రద్దుచేసి పనులు త్వరితగతిన పూర్తిచేయాల్సిన కేంద్రం... ఫ్లైఓవర్‌కు ఇరువైపు గుంతలు లేకుండా చేసి వాహనదారులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని ఆర్ అండ్ బీ శాఖకు ఉచిత సలహా ఇస్తున్నది. ఇరువైపులా రోడ్డు పునరుద్ధరణ పనులకు సదరు ఏజెన్సీకి చెందిన ఈఎండీ నుంచి రూ. 4 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు మరమ్మతు పనులు చేపట్టగా, ఇవి సవ్యంగా సాగకపోవడంతో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

## 23 గ్రీన్ ఎలక్ట్రిక్ మెట్రో..

సిటీబ్యూరో, మార్చి 20 ( నమస్తే తెలంగాణ ) : నగరంలో 23 గ్రీన్ ఎలక్ట్రిక్ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు అందుబాటులో ఉన్నట్టు గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్-మణికొండ మార్గంలో 12, పటాన్‌చెరూ-సీబీఎస్ మార్గంలో 6 , పటాన్‌చెరూ-కోఠి మార్గంలో 5 బస్సులు ప్రతి పది, 15 నిమిషాలకు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ బస్సులన్నింటిలోనూ మహిళలకు ఉచిత ప్రయాణం వర్తిస్తుందన్నారు.



## అల్లు అర్జున్‌కు ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్

హీరో అల్లు అర్జున్ ఖైరతాబాద్ ఆర్టీవో కార్యాలయంలో బుధవారం ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్ పొందారు. హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేశ్, ఆర్టీవో పురుషోత్తం ఆధ్వర్యంలో డ్రైవింగ్ లైసెన్స్ ప్రక్రియ పూర్తి చేశారు.

-సిటీబ్యూరో, మార్చి 20 (నమస్తే తెలంగాణ )

## అంతర్జాతీయ కాల్స్‌ను లోకల్‌గా మారుస్తూ..



సిటీబ్యూరో, మార్చి 20 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ ఫోన్ కాల్స్‌ను లోకల్ కాల్స్‌గా మారుస్తున్న ముఠాను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, టెలీకాం విభాగంతో కలిసి పట్టుకున్నారు. వీవోఐపీ(వాయిస్ ఓవర్ ఇంటర్‌నెట్ ప్రోటోకాల్)ని ఉపయోగిస్తూ సంతోష్‌నగర్, బాలాపూర్‌లో మినీ ఎక్స్ఛేంజీలను ఈ ముఠా నిర్వహిస్తున్నది. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మీపెరుమాల్ మీడియాకు వివరాలు వెల్లడించారు. వివిధ దేశాల నుంచి మన దేశానికి వచ్చే ఫోన్ కాల్స్‌ను డీవోటీ(డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీకమ్యూనికేషన్) గేట్‌వేల నుంచి ఆయా ప్రొవైడర్ల ద్వారా వినియోగదారుడికి చేరుతుంది. అయితే దుబాయ్, ఖతార్, సౌదీ తదితర దేశాల నుంచి వచ్చే కాల్స్‌ను గేట్‌వేలకు సంబంధం లేకుండా అక్రమంగా ఐఎల్‌డీ ఎక్స్ఛేంజీలను ఏర్పాటు చేసి రీ రూటింగ్ చేస్తున్నారు. నిందితులు ఉపయోగించే మినీ ఎక్ఛేంజ్‌లలో పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి సిమ్‌కార్డులు కొని ఇక్కడ వాడుతున్నారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో కాల్‌ను రీరూటింగ్ చేసి ఈ ఎక్స్ఛేంజీల ద్వారా లోకల్ కాల్స్‌గా మారుస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో ఈ మినీ ఎక్స్ఛేంజీలపై పోలీసులు దాడి చేసి.. నిందితులు హిదాయత్, ముజాహిద్ అహ్మద్‌లను అరెస్టు చేశారు. వందలాది సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు.